క్లుప్తంగా

పేదలకు వరం ఉజ్వల యోజన



గ్యాస్ కనెక్షన్, సిలిండర్ అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తున్నట్లు హెచ్‌పీ గోకుల్ గ్యాస్ డీలర్ జీసీ వెంకట్ అన్నారు. దసరా, దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద 350 మంది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు అయ్యాయి. దీంతో శనివారం లబ్ధిదారులకు గ్యాస్ స్టవ్, సిలిండర్ ఉచితంగా అందజేశారు. ఈపథకం కింద ఏడాదికి 12 సిలిండర్లకు రూ.300 చొప్పున రాయితీ వర్తిస్తుందని, ఇంత వరకు గ్యాస్ కనెక్షన్ లేనివారి తెల్ల రేషన్ కార్డు దారులు అర్హులని డీలర్ తెలిపారు.

హుండీ కానుకల చోరీ



దుండగుల చేతిలో ధ్వంసమైన హుండీ

డోన్ రూరల్: మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామ సమీపంలో ఉన్న సుంకులమ్మ గుడి హుండీని శనివారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కానుకలను చోరీ చేశారు. ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడికి చేరుకుని తూతూ మంత్రంగా విచారించి వెళ్లిపోయారని గ్రామస్తులు ఆరోపించారు. కాగా ఇదే విషయమై రూరల్ ఎస్‌ఐ సుధాకర్ రెడ్డిని వివరణ కోరగా చోరీ విషయమే తమ దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కంపచెట్లు తొలగింపు



ప్రొక్లెయినర్‌తో కంపచెట్లు తొలగిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల సమీపం నుంచి మీర్జాపురం వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను శనివారం సర్పంచ్ లాయర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని గమనించి ప్రొక్లెయినర్‌తో కంపచెట్లు తొలగించినట్లు సర్పంచ్ తెలిపారు.

ప్రజారోగ్యానికి భరోసా

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు భరోసా కల్పిస్తున్నాయని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శనివారం నందిపాడు గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. నందిపాడు, కల్వటాల గ్రామాల నుంచి వైద్య సేవల కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడారు. పలువురు డాక్టర్లు హాజరై ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పేదలకు వైద్యం భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు వైద్యం చేరువ చేశారని కొనియాడారు. వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ గుర్విరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నాయకులు కామిని తిమ్మారెడ్డి, నాగేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల గ్రామంలో..

డోన్ రూరల్: మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామంలో శనివారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు మధులిక, రాంభూపాల్ హాజరై 183 మందికి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు డాక్టర్లు సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రభాకర్, చెన్నయ్య, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం

బనగానపల్లె: మండలంలోని కైప గ్రామంలో శనివారం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. వైద్య శిబిరంలో వైద్యులు శివశంకరుడు, సోహెల్‌బాబు, ఫిరోజ్, లక్ష్మి, శైలజ, మంగ్యానాయక్ పాల్గొని 1,170 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు, కంటి అద్దాలు పంపిణీ చేసి మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, ఈఓ ఖలీల్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, వీరారెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవల గురించి ప్రజలతో చర్చిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



అవుకులో వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సీతారామాపురం గ్రామంలో..

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి పరిశీలించారు. వైద్యులు ప్రజలకు బీపీ, షుగర్, రక్త, గళ్ల, కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బాబుల్‌రెడ్డి, సీతారామాపుం, శంకలాపురం, గోరుమానుకొండ సర్పంచులు వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరిబాబు, ఈఓఆర్డీ, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ నగర్..

హనుమాన్ నగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు ముర్తుజావలి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్ పరిశీలించారు. వైద్యులు ప్రజలను పరీక్షించి, మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్ బాబు, వార్డు కౌన్సిలర్స్ నాగజ్యోతి, మహేశ్వరీ, ఇబ్రహీమ్, అంజి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఖాజా హుస్సేన్, నాయకులు వలిబాషా, నిరంజన్, జశ్వంత్ రెడ్డి, నాగరాజు, కిరణ్ పాల్గొన్నారు.

వైద్య శిబిలను సద్వినియోగం చేసుకోండి

అవుకు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. డాక్టర్లు నవీన్, యమున , ఈఎన్‌టీ చిన్న లింగన్న, ఆప్తమాలజిస్ట్ ముదాసిర్ హాజరై 330 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, గుండె, కంటి తదితర పరీక్షలు చేసి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. సర్జరీలు అవసరమైన 24 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మందా గుర్రమ్మ, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు



కైప గ్రామంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్



సీతారామాపురంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు



హనుమాన్‌నగర్‌లో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఏపీఎంగా శ్రీనివాసులు

బేతంచెర్ల: ఏపీఎంగా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఏపీఎం లింగమయ్య మరణించండంతో ఆ స్థానంలో నంద్యాల ఏపీఎం శ్రీనివాసులను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వాసుపత్రికి మంచినీటి సౌకర్యం



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

డోన్: గుత్తి రోడ్డు రుద్రాక్షగుట్ట వద్ద నిర్మించిన వంద పడకల ప్రభుత్వాసుపత్రి నూతన భవన సముదాయానికి తాగునీ వసతులు కల్పించినట్లు మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శనివారం గాజుల దిన్నె ప్రాజెక్టు ద్వారా రూ.30 లక్షలతో నిర్మించిన తాగునీటి సరఫరా పనులకు ట్రయల్‌రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల్లో వంద పడకల ప్రభుత్వాసుపత్రి వైద్యసేవలందించేందుకు సిద్ధమవుతున్నందువల్ల రోగులు, సహాయకులకు మంచినీటి వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ రసూల్, ఏఈ సురేష్, కౌన్సిలర్ రైల్వే నాగేంద్ర, కాంట్రాక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ లక్ష్మిదేవి(48) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షులు నగేష్, వీఆర్‌ఏలు మంజునాథ్, మద్దిలేటి, బాలయ్య, మునెమ్మ, శ్రీనివాసులు తదితరులు శనివారం లక్ష్మిదేవి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.22 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.



అ'పూర్వ' కలయిక

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్(గురుకుల) జూనియర్ కళాశాల 1997–99 టెన్త్, ఇంటర్మీడియెట్ బ్యాచ్ విద్యార్థినులు శనివారం కళాశాలలో సమావేశమయ్యారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థినులు కోలా లక్ష్మిదేవి, శ్యామల, చెన్నమ్మ, వినీల, భాగ్యవేణి, శ్రీవాణి, టీసీ లక్ష్మి పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి కృషి




షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: స్థానిక ఇండోర్ స్టేడియం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. దసరా పండుగ పురస్కరించుకుని దివంగత కాటసాని నాగార్జునరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెండేకంటి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు తన కుమారుడి పేరుతో ఏర్పాటు చేసిన నాగార్జునరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు క్రీడాసామగ్రిని అందజేవామన్నారు. క్రీడాకారులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులు కూడా షటిల్ టోర్నమెంట్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడాకారుల విన్నపం మేరకు ఇండోర్ స్టేడియంలో మరో ఉడన్ కోర్టు, సీసీ రోడ్డు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. రెండు రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో ఉమ్మడి జిల్లాల నుంచి వంద టీమ్‌లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, కొత్తపేట సర్పంచ్ వెంకటరమణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వేణుగోపాల్, డాక్టర్ రవికుమార్, బీసీ సంఘం నాయకులు శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు శివరామిరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మి అలంకారంలో అమ్మవారు



బేతంచెర్లలో మహిషాసురమర్దినిగా ఉత్సవమూర్తి



కొండపేటలో అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు



కోవెలకుంట్లలో గజలక్ష్మిదేవి అలంకారంలో వాసవీమాత



సంజామలలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు..

ధైర్యలక్ష్మి..మమ్మేలుకోవమ్మా!

- భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రోత్సవాలు



అంకాలమ్మ చౌరస్తాలో లలిత త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలో లలితా త్రిపుర సుందరిదేవిగా..



నందవరంలో కాళరాత్రి అలంకారంలో అమ్మవారు



ప్యాపిలిలో సరస్వతి దేవిగా..

బేతంచెర్ల: దశసరా శర న్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. డోన్,, బనగానపల్లె నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అందులో భాగంగా వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారు ధైర్య లక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి, ప్రధాన అర్చకుడు మద్దిలేటిస్వామి ఆధ్వర్యంలో 10 వేల మూల మంత్ర జప హోమాదులు నిర్వహించారు. ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు పాలక మండలి సభ్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు సహస్రదీపాలంకరణ సేవలో దేదీప్యమానంగా వెలిగిపోయారు. అమ్మవారి పంచలోహ విగ్రహం, సుదర్శన ఆళ్వార్లను ఆలయ మాడవీధుల్లో రథోత్సవంపై ఊరేగింపు నిర్వహించారు. అలాగే బేతంచెర్ల అమ్మవారి శాలలో వాసవీమాతను మహిషాసురమర్దినిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

డోన్: పట్టణంలోని అమ్మవార్ల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపేటలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ప్యాపిలి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీమత్కన్యకా రమేశ్వరి ఆలయంలో వాసవీ మాత శనివారం సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు ఉదయం వాసవీమాతకు కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంకాలమ్మ చౌరస్తా, సరస్వతీనగర్‌లో వెలసిన ఆలయాల్లో మారెమ్మ అమ్మవారు లలిత త్రిపుర సుందరీదేవి, సరస్వతీమాత గౌరీదేవి అలంకారంలో భక్తులను కనువిందు చేశారు.

కొలిమిగుండ్ల: శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. శనివారం ఏడో రోజు అంకిరెడ్డిపల్లెలోని గీతాశ్రమంలో రాజరాజేశ్వరి దేవి లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలోను, తిమ్మనాయినపేటలో వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో అష్టలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారు శనివారం కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. కొండపేటలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవిని లలితా త్రిపుర సుందరిదేవి అలంకరించి పూజించారు.

సంజామల: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా, నొస్సం గ్రామంలో మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అవుకు: మండల కేంద్రంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారు శనివారం ధన లక్ష్మీ దేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆలయ పండితులు సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బతుకుబాటలో మృత్యుఒడి

- గోర్లగుట్ట మలుపుల్లో అదుపు తప్పి పల్టీలు కొట్టిన ట్రాక్టర్
- ఇద్దరు లోడింగ్ కార్మికుల దుర్మరణం
- మహిళకు తీవ్ర గాయాలు
- క్షేమంగా బయటపడిన ముగ్గురు



గోర్లగుట్ట మలుపుల్లో బోల్తాపడిన ట్రాక్టర్





మృతి చెందిన హరీష్ (ఫైల్), దూదేకుల దస్తగిరి (ఫైల్)

బేతంచెర్ల: మరో రెండు రోజుల్లో పండగ చేసుకోవాల్సిన రెండు కుటుంబాల్లో మృత్యువు విషాదాన్ని నింపింది. కుటుంబ పోషణకు రెక్కల కష్టాన్ని నమ్ముకుని బయలుదేరిన ఇద్దరిని మృత్యువు విగతజీవులుగా మార్చి ఇంటికి పంపింది. కర్నూలు – బనగానపల్లె రహదారిలో గోర్లగుట్ట మలుపుల్లో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లోడింగ్ కార్మికులు మృత్యువాత పడ్డారు. మరో మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్ల మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామానికి చెందిన హరీష్ (30) బేతంచెర్ల పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన దూదేకుల దస్తగరి(49) కొన్నేళ్లుగా నాపరాళ్ల ట్రాక్టర్ లోడింగ్ కార్మికులుగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. రోజు మాదిరిగానే ఇద్దరు లోడింగ్ పని కోసం ట్రాక్టర్‌లో మరో నలుగురు కార్మికులతో కలసి బేతంచెర్ల వైపు నుంచి నాపరాయి లోడింగ్ కోసం బనగానపల్లె మండలం పలుకూరుకు బయలుదేరారు. అయితే గోర్లగుట్ట మలుపుల్లో బనగానపల్లె వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్‌ను తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో హరీష్‌పై ట్రాక్టర్ ఇంజన్ పడటంతో తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దూదేకుల దస్తగిరిపై ట్రాక్టర్ ట్రాలీ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణంలోని సంజీవ నగర్ కాలనీకి చెందిన లక్ష్మీదేవికి రెండు కాళ్లు, కుడి చెయ్యి విరిగింది. రామలక్ష్మికి స్వల్ప గాయాలు కాగా, ప్రమాద సమయంలో బలపాలపల్లె గ్రామానికి చెందిన సిద్దయ్య, హుసేన్ బాషా ఇద్దరు ట్రాక్టర్‌పై నుంచి కిందికి దూకడంతో క్షేమంగా బయట పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శివశంకర్ నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రహదారి మధ్యలో రోడ్డు ప్రమాదం జరగడంతో రహదారికి ఇరువైపులా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు బోల్తా పడిన ట్రాక్టర్‌ను మృత దేహాలను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునఃరుద్ధరించారు. మృతుడు హరీష్‌కు భార్య లక్ష్మీదేవితోపాటు ముగ్గురు చిన్నారులు, దూదేకుల దస్తగిరికి భార్య వన్నూర్‌బీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సంఘటన స్థలం వద్ద మృతుల కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

ఎక్స్‌ప్రెస్ రైలును నంద్యాల వరకు పొడిగించాలి

కోవెలకుంట్ల: ప్రస్తుతం విశాఖపట్నం నుంచి నడుస్తున్న కడప– తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును నంద్యాల–ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో కోవెలకుంట్ల మీదుగా నంద్యాల వరకు పొడిగించాలని రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైలు విశాఖ నుంచి బయలుదేరి ఉదయం 7 గంటలకు కడపకు చేరుకుని తిరిగి సాయంత్రం 5.45 గంటలకు విశాఖకు బయలుదేరుతుందన్నారు. ఈ మధ్య దాదాపు 10 గంటల సమయం ఖాళీగా ఉంటుందన్నారు. రైలును నంద్యాల వరకు పొడగించడం వల్ల వైఎస్సార్, నంద్యాల జిల్లాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

డోన్ టౌన్: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరాం డిమాండ్ చేశారు. స్థానిక మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో శనివారం ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోయలేని భారం వేస్తున్నాయన్నారు. 50 ఏళ్లు దాటిన డ్రైవర్లకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.